
మరికల్ చౌరస్తాలో కొలువుదీరిన మట్టి గణపతి


కృష్ణాలోని కున్సిలో ప్రతిష్ఠించిన గణనాథుడు


మక్తల్‌లో వీరభద్ర దేవాలయంలో పూజల అనంతరం భక్తులు


కోస్గిలోని మున్నూర్ వీధిలో కొలువుదీరిన భారీ గణనాథుడు

ఊరూరా చవితి వేడుకలు


నారాయణపేటలో లంబోదరుడి శోభాయాత్ర


నారాయణపేటలో వినాయకున్ని మండపానికి తీసుకెళ్తున్న భక్తులు


నారాయణపేటలో మట్టి వినాయకుడిని ప్రతిష్ఠించిన విద్యార్థులు


మద్దూరులో భారీ విగ్రహాన్ని ప్రతిష్ఠిస్తున్న నిర్వాహకులు


మక్తల్‌లో ప్రతిష్ఠించిన గణనాథుడికి పూజలు చేస్తున్న భక్తులు

సాక్షి నెట్‌వర్క్: వినాయక చవితి సందర్భంగా ఊరూరా నవరాత్రి ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. కమిటీల ఆధ్వర్యంలో బొజ్జ గణపయ్యను కొలువుదీర్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పలుచోట్ల వినూత్నరీతిలో కొలువుదీరిన గణనాథుడి విగ్రహాలు భక్తులను ఆకట్టుకుంటున్నాయి.

❖ నారాయణపేటలోని అన్ని గ్రామాల్లో ఉండ్రాలస్వామికి పూజలు నిర్వహించారు. ఎక్లాస్‌పూర్ గ్రామంలో ప్రజలంతా కలిసికట్టుగా ఒకే వినాయకుడిని ఏర్పాటు చేశారు. స్థానిక గోవిందరాజుల దేవాలయంలో ఆర్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో ప్రతిష్ఠించిన 'ఏక'దంతుడికే భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు.

❖ కోస్గిలోని మున్నూర్ వీధిలో ఎప్పటిలాగే 18 అడుగుల అతిపెద్ద వినాయకుడిని ప్రతిష్ఠించగా హిందూ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో స్థానిక శివాజీ చౌరస్తాలో ప్రత్యేక ఆకారంలో ఏర్పాటు చేసి మట్టి వినాయకుడిని ప్రతిష్ఠించారు.

❖ మక్తల్ పట్టణంలోని పడమటి ఆంజనేయస్వామి దేవాలయం వద్ద, నెహ్రూగంజ్, ఎల్లమ్మకుంట, ఆజాద్‌నగర్‌లో నిఈశ్వరాలయం, నల్లజానమ్మ దేవాలయంతో పాటు ప్రతిచోట్ల విగ్రహాల ను పెద్ద ఎత్తున ప్రతిష్ఠించారు. మాజీ జెడ్పీటీసీ సభ్యుడు లక్ష్మారెడ్డి, రాష్ట్ర నాయకుడు కొండయ్య, శేషగిరి, గణేశ్‌కుమార్, కర్నిస్వామి, సత్యనారాయణగౌడ్ ప్రత్యేక పూజలు నిర్వహించారు.

❖ కృష్ణా మండల కేంద్రంతో పాటు కున్సీ, గుడెబల్లూర్, ముడుమాల్, టైరోడ్డు, హిందుపూర్, ఆలంపల్లి గ్రామాల్లోని వాడవాడల్లో బొజ్జగణపయ్య విగ్రహాలను భక్తిశ్రద్ధలతో ప్రతిష్ఠించారు.

❖ ధన్వాడలో అన్ని గ్రామాల్లో గణనాథులను ప్రతిష్ఠించారు. వివిధ రకాలుగా మండపాలు నిర్మించి గణనాథులను ప్రతిష్ఠించి పూజ కార్యక్రమాలు నిర్వహించారు.

❖ మరికల్‌లోని అప్పంపల్లి తదితర గ్రామాల్లో ఏర్పాటు చేసిన మట్టి గణపతి విగ్రహాలకు ఉత్సవ కమిటీ సభ్యులు ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదలతో పాటు అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు.

❖ మద్దూరు మండల కేంద్రంలో 60 పైగా మండపాల్లో గణనాథులను ఉంచారు. రాష్ట్రంలోనే రెండో అతిపెద్ద వినాయక విగ్రహాన్ని మద్దూరు పట్టణంలో బాలాంజనేయ గణేష్ యూత్ ఆధ్వర్యంలో రావులపల్లి రోడ్‌లో ప్రతిష్ఠించారు. హైదరాబాద్‌లోని ఖైరతాబాద్ విగ్రహం తయారు చేసినా వారితోనే దీన్ని తయారు చేయించారు. 35 అడుగుల ఎత్తులో ఈ విగ్రహాన్ని ఏర్పాటు చేశారు.

❖ నర్వలోని ఆయా గ్రామాల్లో గణనాథులు కొలువుదీరారు. ఉత్సవ మూర్తులను రుత్వికుల వేదమంత్రోచరణలతో ప్రతిష్ఠించి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

❖ ఊట్కూరులో వినాయక ఉత్సవ సమితి ఆధ్వర్యంలో గ్రామ పురవీధుల్లో శోభయాత్ర చేపట్టి మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేశారు. దేవాలయాల దగ్గర వినాయక విగ్రహాలను ప్రతిష్ఠించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ భాస్కర్, మాజీ జెడ్పీటీసీ అరవింద్‌కుమార్, నాయకులు లింగం, మహేష్ రెడ్డి, హనుమంతు, గోపాల్‌రెడ్డి, రమేష్, లక్ష్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.


ఊట్కూరులో అయోధ్యనగర్‌లో విగ్రహాన్ని ప్రతిష్ఠించిన చిన్నారులు


ధన్వాడలో ముదిరాజ్‌ల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఏకదంతుడు

క్లుప్తంగా

నేడు ఎమ్మెల్యే పర్యటన

నారాయణపేట రూరల్: నియోజకవర్గంలో అభివృద్ధి పనులను ప్రారంభించేందుకు ఎమ్మెల్యే పర్ణికా రెడ్డి శుక్రవారం పట్టణంలో పర్యటించనున్నారు. ఉదయం 10:30 గంటలకు నారాయణపేట మండలం అప్పక్‌పల్లి దగ్గర గల జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో సిటీ స్కాన్ సేవలను కలెక్టర్ సిక్తా పట్నాయక్‌తో కలిసి ప్రారంభిస్తారు. అనంతరం మధ్యాహ్నం 12:00 గంటలకు కోయిలకొండ మండల కేంద్రంలో గ్రంథాలయ భవనాన్ని ప్రారంభిస్తారని ఆయా మండల నాయకులు, ప్రజా ప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొనాలని కాంగ్రెస్ నాయకులు కోరారు.

నిమజ్జన ఏర్పాట్లను పరిశీలించిన కమిషనర్



మద్దూరు: పట్టణంలో వినాయక చవితి సందడి మొదలైంది. ఈక్రమంలో నిమజ్జనానికి సంబంధించిన ఏర్పాట్లను కమిషనర్ ఏతమహేష్‌తో కలిసి పరిశీలించారు. రోడ్లపై గుంతలు లేకుండా మట్టిని పోయించడం, కాచెరువు దగ్గర నిమజ్జనం సందర్భంగా ఘాట్ ఏర్పాటుతో పాటు, విద్యుత్ లైట్ల ఏర్పాట్లు తదితర అంశాలను పరిశీలించారు. కార్యక్రమంలో పుర సిబ్బంది రామునాయక్, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

ఇళ్లను త్వరితగతిన నిర్మించుకోవాలి

ధన్వాడ: ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం త్వరగతిన పూర్తి చేయాలని మండల ఎంపీడీ వెంకటేశ్వర్ రెడ్డి సూచించారు. మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఇందిరమ్మ ఇళ్లపై గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇందిరమ్మ ఇళ్లు మంజూరైన లబ్ధిదారులు త్వరగా పనులు ప్రారంభించి పూర్తి చేసుకోవాలని ప్రభుత్వం బేస్‌మెంట్ పూర్తి చేసిన వెంటనే రూ.లక్ష మంజూరు చేస్తుందని స్లాబ్ వేసిన తర్వాత రూ.2లక్షలు విడుదల చేస్తుందన్నారు. ఇప్పటి వరకు నిర్మాణం చేపట్టని వారు త్వరగా నిర్మాణాలు ప్రారంభించాలని సూచించారు. కార్యక్రమంలో ఇందిరమ్మ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తికి తీవ్రగాయాలు

కోస్గి రూరల్: ద్విచక్ర వాహనంపై నుంచి కిందపడి ఓ వ్యక్తికి తీవ్రగాయాల పాలైన ఘటన బుధవారం రాత్రి చోటు చేసుకుంది. బాధితుడి కథనం మేరకు వికారాబాద్ జిల్లా దౌల్తాబాద్‌కు చెందిన రాజు వ్యక్తిగత పనుల నిమిత్తం కోస్గికి వచ్చాడు. పనులు ముగించుకొని తిరిగి వెళ్తున్న క్రమంలో వాహనం అదుపుతప్పి మురికికాలువలో పడిపోయాడు. ప్రమాదంలో కాలు విరిగి తీవ్రగాయాలు కావడంతో 108లో జిల్లా ఆస్పత్రికి తరలించారు.

కుక్కల దాడిలో జింక మృతి

మాగనూర్: కుక్కల దాడిలో జింక మృతి చెందిన ఘటన మాగనూర్ మండల కేంద్రంలోని శ్రీ లక్ష్మినర్సింహస్వామి ఆలయం సమీపంలో గురువారం చోటు చేసుకుంది. ఆహారం కోసం పంట పొలాల వద్దకు రాగా కుక్కలు దాడి చేసి చంపేసినట్లు స్థానిక ప్రజలు తెలుపుతున్నారు. అధికారులు స్పందించి జింకల సంరక్షణ కోసం జింకల పార్కును ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

పాఠశాలకు ప్లేట్ల వితరణ



నర్వ: మండలంలోని ఉందేకోడ్ ప్రాథమిక పాఠశాలలో గురువారం దాతలు విద్యార్థులకు ప్లేట్లను వితరణ చేశారు. గ్రామానికి చెందిన కీ.శే. గడ్డమీది గౌడప్ప జ్ఞాపకార్థం ఆయన కుమారులు విద్యార్థులకు ప్లేట్‌లను అందించారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామస్థులు, ఉపాధ్యాయులు దాతలను అభినందించారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు బాల్‌దాసు, నెల్లురి వెంకటయ్య, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

అప్రమత్తంగా ఉండాలి

అమరచింత: సైబర్ నేరాలతో అప్రమత్తంగా ఉండాలని ఎంఎస్ఎంఈ కోఆర్డినేటర్ రాజ్ కుమార్ అన్నారు. మండలకేంద్రంలో ఎంఎస్ఎంఈ ద్వారా వర్తకులకు సైబర్ నేరాల పట్ల అవగాహన కల్పించారు. సమావేశంలో చేనేత ఉత్పత్తుల సంఘం సీఈఓ శేఖర్, తాటికొండ విజయ్, తొకలి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఓటరు జాబితా ప్రచురణ


ధన్వాడలో ముసాయిదా ఓటరు జాబితాను పరిశీలిస్తున్న గ్రామస్తులు

ధన్వాడ: ధన్వాడ గ్రామ పంచాయతీ కార్యాలయంలో గురువారం ముసాయిదా ఓటరు జాబితాను గ్రామ పంచాయతీ అధికారులు ప్రచురణ చేశారు. ఈ నెల 30వ తేదీ లోపు అభ్యంతరాల స్వీకరణకు గడువు ఉందని ఎవరికైన అభ్యంతరాలు ఉంటే రాతపూర్వకంగా గ్రామ పంచాయతీ కార్యాలయంలో లేదా ఎంపీడీఓ కార్యాలయంలో ఫిర్యాదు చ

సెప్టెంబర్ 2న తుది జాబితా

మద్దూరు: స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో అధికారులు గురువారం ఓటర్ లిస్టు ప్రదర్శించినట్లు ఎంపీడీఓ రహ్మతుద్దీన్ తెలిపారు. మద్దూరు మండలంలోని 24 గ్రామపంచాయతీల్లో మొత్తం 26,217 మంది ఓటర్లు ఉండగా వీరి కోసం 204 వార్డులను పోలింగ్ స్టేషన్లుగా గుర్తించినట్లు పేర్కొన్నారు. ఓటరు లిస్టులో ఏమైనా అభ్యంతరాలు ఉంటే నేటి నుంచి ఈనెల 30 వరకు పంచాయతీ కార్యదర్శికి గానీ, ఎంపీడీఓ కార్యాలయంలో గానీ ఫిర్యాదు చేయొచ్చన్నారు. ఈ నెల 30న ఎంపీడీఓ కార్యాలయంలో అన్ని రాజకీయ పార్టీల సమావేశం ఉంటుందన్నారు. సెప్టెంబర్ 2న తుది జాబితా ప్రచురించనున్నట్లు పేర్కొన్నారు.

ఉట్కూరులో 10వేల మంది ఓటర్లు

ఊట్కూరు: ఊట్కూరు గ్రామపంచాయితీ కార్యాలయం దగ్గర ఉన్నతాధికారుల ఆదేశానుసారం ఓటర్ లిస్టును ప్రదర్శించారు. గ్రామంలో 16వ వార్డులకు గాను 10,180 ఓట్లు ఉన్నట్లు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు ఎల్కోటి జనార్ధన్‌రెడ్డి, లక్ష్మారెడ్డి, హనుమంతు, నర్సింహారెడ్డి, భరత్, రమేష్‌బాబు పాల్గొన్నారు.

ఫిర్యాదుకు అవకాశం

కొత్తపల్లి: మండలంలో గ్రామ పంచాయతీల వారీగా ఓటరు జాబితాను ఎంపీడీఓ విడుదల చేశారు. జాబితాపై ఏమైన అభ్యంతరాలుంటే ఈనెల 30వ తేదీలోపు ఫిర్యాదు చేయొచ్చన్నారు.

వైద్యశిబిరాన్ని సద్వినియోగించుకోవాలి

నారాయణపేట రూరల్: టీయూడబ్ల్యుజే (ఐజేయూ) ఆధ్వర్యంలో జిల్లాలోని జర్నలిస్ట్ కుటుంబాల కోసం నిర్వహిస్తున్న ఉచిత హెల్త్ క్యాంప్‌ను సద్వినియోగం చేసుకోవాలని సంఘం జిల్లా అధ్యక్షుడు నారాయణరెడ్డి అన్నారు. ఈ మేరకు వైద్యశిబిరానికి సంబంధించిన వాల్ పోస్టర్‌ను గురువారం స్థానిక ప్రెస్ క్లబ్‌లో విడుదల చేశారు. ఈ నెల 30 ఉదయం 10 నుంచి సాయంత్రం 4గంటల వరకు పట్టణంలోని ఎస్ఆర్ గార్డెన్ ఫంక్షన్ హాల్‌లో వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ శిబిరంలో కార్డియాలజీ, ఆర్థోపెడిక్, గైనకాలజీ, జనరల్ మెడిసిన్, న్యూరాలజీ విభాగాలతో పాటు బీపీ, షుగర్, ఈసిజీ, 2డి ఎకో తదితర సర్వీసులు పొందవచ్చని తెలిపారు.

సీఎం, మంత్రుల చిత్రపటాలకు క్షీరాభిషేకం

అమరచింత: చంద్రగడ్ ఎత్తిపోతల పథకానికి రూ.1.92 కోట్ల మంజూరు చేయడంతో సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు వాకిటి శ్రీహరి, ఉత్తమ్ కుమార్ రెడ్డి చిత్రపటాలకు చంద్రగడ్ రైతులు క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చంద్రగడ్ ఎత్తిపోతల పథకం పూర్తి అయితే మండలంలో సుమారు 15వేల ఎకరాలు సాగులోకి వచ్చేందుకు అవకాశం ఉంటుందన్నారు. సీఎం రేవంత్ రెడ్డి అన్నదాతల సంక్షేమమే ధ్యేయంగా పాలన సాగిస్తున్నారడానికి ఇదే ఉదాహరణ అన్నారు. కార్యక్రమంలో స్థానిక కాంగ్రెస్ నాయకులు, రంగన్న, సుధాకర్‌రెడ్డి, బాల్‌రెడ్డి,అశోక్, చిన్నారెడ్డి ,కురువ చిన్నయ్య, మాదన్న తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ నాయకుడిని పరామర్శించిన మంత్రి



ఊట్కూరు: పట్టణానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు మోట్కూర్ మోహన్‌రెడ్డిని బుధవారం పశుసంవర్ధక మత్స్యశాఖమంత్రి వాకిటి శ్రీహరి పరామర్శించారు. రెండు రోజుల క్రితం తీవ్ర అస్వస్థతకు గురి కావడంతో కుటుంబసభ్యులు హైదరాబాద్‌లోని ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించారు. విషయం తెలుసుకున్న మంత్రి ఆస్పత్రికి వెళ్లి బాధితుడిని పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని ఆసుపత్రి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. మెరుగైన వైద్యం అందించాలని సూచించారు. మంత్రి వెంట మక్తల్ మాజీ వైస్ ఎంపీపీ, యశోద, ప్రతాప్‌రెడ్డి ఉన్నారు.

ఎరువుల దుకాణాల్లో తనిఖీలు



మద్దూరు: రాష్ట్రంలో యూరియా కొరత, నకిలీ ఎరువుల విక్రయం తదితర అంశాలపై క్షేత్ర స్థాయిలో పరిశీలించడానికి రాష్ట్ర ఎన్‌ఫోర్స్‌మెంట్ అండ్ విజిలెన్స్ అధికారులు గురువారం మద్దూరు పట్టణంలోని మన గ్రోమోర్, పీఏసీఎస్ కార్యాలయం, ఇతర ఫర్టిలైజర్స్ షాపుల్లో ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. రికార్డులను పరిశీలించి రైతులకు యూరియా సరఫరా చేస్తున్న విధానాన్ని పరిశీలించారు. అనంతరం రైతులతో మాట్లాడి యూరియా కొరత గురించి అడిగి తెలుసుకున్నారు. ఎరువుల పంపిణీలో అవకతవకలు జరిగినట్లు గుర్తించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోస్గి ఏడీఏ రామకృష్ణకు ఆదేశించినట్లు సమాచారం.

యూరియా కోసం రైతుల పడిగాపులు


యూరియా కోసం పీఏసీఎస్ కార్యాలయానికి వచ్చిన రైతులు

మద్దూరు: యూరియా కోసం మండలంలోని పీఏసీఎస్ కార్యాలయం ఎదుట రైతులు పడిగాపులు కాశారు. పీఏసీఎస్‌కు 600 బస్తాల యూరియా రాగా రైతులు బారులు తీరారు. దీంతో ఉద్రిక్తత నెలకొంది. బీఆర్‌ఎస్ నాయకులు అక్కడి చేరుకొని రైతులకు మద్దతు తెలిపారు. దీంతో అక్కడే ఉన్న కోస్గి ఏడీఏ రామకృష్ణ రైతులను శాంతింపజేసి ఒక్కొక్కరికి రెండు బస్తాల చొప్పున అందజేశారు. బుధవారం సెలవు రోజు కావడంతో యూరియా సరఫరా చేయలేదని అవసరమున్న రైతులందరికీ యూరియా అందిస్తామన్నారు. యూరియా కొరత ఉందనే అపోహతో రైతులు నిల్వ చేసుకోవద్దని సూచించారు. నానో యురియాను కూడా వినియోగించాలని సూచించారు. దాదాపు 70 మంది రైతులకు యూరియా కోసం టోకన్లను అందజేశారు. రేపటికల్లా వారికి కూడా యూరియా అందిస్తామని హామీ ఇచ్చారు. దీంతో రైతులు శాంతించారు.

మినీ వాటర్ ట్యాంక్ ఏర్పాటు


కోటకొండలో వాటర్ ట్యాంక్‌ను ప్రారంభిస్తున్న బాలస్వామి

నారాయణపేట రూరల్: కోటకొండ గ్రామానికి చెందిన పగుడాకుల తిరుపతమ్మ జ్ఞాపకార్థం గ్రామంలో నిర్మించిన మినీ వాటర్ ట్యాంక్‌ను బుధవారం ప్రారంభించారు. స్థానిక ముదిరాజు వీధి బొడ్డురాయి దగ్గర తాగునీటికి ఇబ్బందులు ఉన్న నేపథ్యంలో మహిళల సౌకర్యార్థం ఆమె కుమారుడు విశ్వ హిందూ పరిషత్ రాష్ట్ర ప్రచార కార్యదర్శి పగుడాకుల బాలస్వామి ట్యాంకును ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాబోవు రోజుల్లో పేదల సంక్షేమం కోసం కోటకొండ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయే సంక్షేమ కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలిపారు. కోటకొండ ప్రజల సంక్షేమం కోసం తమ వంతు పని చేస్తామని, అందులో ప్రధానంగా తాను పుట్టి పెరిగిన బొడ్రాయి వీధి కోసం నిరంతరం పని చేస్తానన్నారు. తన తల్లి పేరు మీద ఒక ట్రస్టును ఏర్పాటు చేశానని, దీని ద్వారా కోటకొండ ప్రజలకే కాకుండా.. సహాయం కోసం వచ్చిన ప్రతి వ్యక్తికి అండగా నిలబడతానని చెప్పారు. ప్రతి నిరుపేదకు సహాయం అందించే లక్ష్యంతో శ్రీ అంత్యోదయ వెల్ఫేర్ ఫౌండేషన్‌ను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో రాజు, ప్రభంజన్ రావు, లక్ష్మారెడ్డి, నర్సింహులు, దస్తప్ప, ఆంజనేయులు, కాశీనాథ్, కృష్ణ, సాయిలు, కురుమయ్య, సాయిలు,రవికుమార్, సిద్దు, సురేందర్, నవీన్, గోవిందు, శంకర్, వెంకటేష్, కాలప్ప, జగదీష్, శ్రీధర్, దస్తప్ప,బాలప్ప, తిరుపతి, ఆశప్ప పాల్గొన్నారు.

చదువుతోపాటు క్రీడల్లో రాణించాలి

నారాయణపేట టౌన్: విద్యార్థులు చదువుతో పాటు క్రీడలలో రాణించాలని ఎస్‌జీఎఫ్ సెక్రటరీ శ్రీనివాస్ రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని స్థానిక మినీ స్టేడియంలో జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకొని నారాయణపేట క్రికెట్ అసోసియేషన్, పీఈటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మండల స్థాయి పాఠశాల క్రికెట్ టోర్నమెంట్‌లో గురువారం ఆయన పాల్గొని మాట్లాడారు. ఏటా జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా పాఠశాల విద్యార్థులకు క్రికెట్ పోటీలు నిర్వహించడం హర్షించదగ్గ విషయమన్నారు. అలాగే విద్యార్థులు క్రీడాలలో పాల్గొనడం ద్వారా శారీరక దృఢత్వంతో పాటు మానసిక ఉల్లాసం కలుగుతుందన్నారు. కార్యక్రమంలో బేస్‌బాల్ ప్రెసిడెంట్ చిన్నారెడ్డి, సెక్రెటరీ నాగేష్, క్రికెట్ కోచ్ అజయ్, పీఈటీ రమణ పాల్గొన్నారు.

ఆత్మీయ భరోసా పథకం అమలు చేయాలి

నారాయణపేట టౌన్/నారాయణపేట రూరల్: ప్రతి వ్యవసాయ భూ మిలేని కూలీకి ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకం కింద ఏడాదికి రూ.12వేలు సాయమందించాలని ఏఐఏకేఎంఎస్ నేతలు కోరారు. ఈ మేరకు గురువారం డిప్యూటీ తహసీల్దార్ రామకృష్ణకు వినతిపత్రం సమర్పించారు. ఈ మేరకు సంఘం జిల్లా కార్యదర్శి ప్రశాత్ మాట్లాడుతూ.. వ్యవసాయ కూలీలకు ప్రభుత్వం ఏడాదికి రూ.12వేలు ఇస్తామని హామీ ఇచ్చి ఇప్పుడు మాట తప్పిందన్నారు. కార్యక్రమంలో సంఘం ఉపాధ్యక్షుడు వెంకట్రాములు, సహాయ కార్యదర్శి హాజీ, జిల్లా నాయకులు రాములు, మల్లేష్, బాలప్ప పాల్గొన్నారు.

డీజేను సీజ్ చేసిన పోలీసులు

నారాయణపేట క్రైమ్: పట్టణ పరిధిలోని ఓల్డ్ బస్టాండ్ వద్ద బుధవారం డీజేను సీజ్ చేసినట్లు పోలీసులు తెలిపారు. గణేశ్ విగ్రహ ప్రతిష్ఠాపన సందర్భంగా ఉత్సవ ర్యాలీలో డీజేను వినియోగించగా బైరంకొండ గ్రామానికి చెందిన డీజే ఓనర్ ఈశ్వర్,డీసీయం డ్రైవర్ నరసింహులుపై కేసు నమోదు చేసి వాహనాన్ని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఉత్సవాలలో డీజేలకు అనుమతి లేదని పలుమార్లు హెచ్చరించినా డీజేను వాడినందుకు చర్యలు తీసుకున్నట్లు ఎస్ఐ వెంకటేశ్వర్లు తెలిపారు. డీజేకు బదులు ఇతర వాటిని ఉపయోగించాలని తెలిపారు.

సొంత నిధులతో హైమాస్ట్ లైట్ల ఏర్పాటు



నారాయణపేట టౌన్: పట్టణంలోని శాతవాహన కాలనీలో ఉన్న మజీద్ దగ్గర సరైన లైటింగ్ లేకపోవడంతో ముస్లింలు ఇబ్బందులు పడేవారు. ఈ విషయం తెలుసుకున్న యువ నాయకుడు వెంకటేష్ గౌడ్, ఎమ్మెల్యే పర్ణికారెడ్డి ఆదేశం మేరకు తన సొంత నిధులతో మజీద్ ప్రాంగణంలో హైమాస్ట్ లైట్స్‌ను ఏర్పాటు చేయించాడు. ఈ సందర్భంగా కాలనీవాసులు, ముస్లిం సోదరులు ఎమ్మెల్యేకు అలాగే వెంకటేష్‌గౌడ్‌కు ధన్యవాదాలు తెలిపారు.

ఏఎస్ఐగా కృష్ణయ్య

ఆత్మకూర్: ఇంటెలిజెన్స్ ఏఎస్ఐగా కృష్ణయ్య బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ గత ఆరేళ్లుగా హెచ్‌సీగా విధులు నిర్వహిస్తున్న ఇనకు బుధవారం ఏఎస్ఐగా పదోన్నతి లభించింది. ఈ క్రమంలో కృష్ణయ్య ఆత్మకూర్, అమరచింత మండలాలకు సేవలు అందించనున్నారు. ఈ మేరకు సీఐ శివకుమార్, ఎస్ఐలు నరేందర్, స్వాతి, హిమబిందు, సిబ్బంది కృష్ణయ్యను అభినందించి శుభాకాంక్షలు తెలిపారు.

ఎయిడ్స్‌పై అవగాహన సదస్సు



నారాయణపేట రూరల్: జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో స్థానిక సీఎస్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం ఎయిడ్స్ పై అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులకు 5కే నిర్వహించారు. పరుగు పోటీల్లో బాలుర, బాలికల విభాగంలో మొదటి రెండు స్థానాల్లో నిలిచిన వారికి బహుమతులు అందజేసి విజేతలు రాష్ట్ర స్థాయి పోటీలో పాల్గొంటారని తెలిపారు. అనంతరం ఎయిడ్స్ మహమ్మారి పై అవగాహన కల్పించారు. డీఎంహెచ్వో జయచంద్ర మోహన్, కళాశాల ప్రిన్సిపల్ మెర్సీ వసంత, వైస్ ప్రిన్సిపల్ రంగారెడ్డి అధ్యాపకులు సత్యప్రకాష్ రెడ్డి, పీఈ బిక్షపతి పాల్గొన్నారు.